మేఘమా... ఉరమకే!!

- వరి రైతు గుండెల్లో గుబులు
- ఉరుకులు, పరుగులు పెట్టిస్తున్న వాతావరణం



వరి హార్వెస్టింగ్ చేస్తున్న యంత్రం

రొంపిచర్ల: వరి సాగు చేసిన మాగాణి రైతాంగాన్ని వాతావరణం ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది. మంగళ, బుధవారాల్లో నెలకొన్న వాతావరణం వరి కోతకు వచ్చిన రైతుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. మంగళవారం రాత్రి ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్మి, సన్నని చినుకులు రాలడంతో పొలంలో హార్వెస్టింగ్ చేసి కల్లాలపై ఉన్న వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు.

వర్షానికి ఇబ్బందులు పడతామనుకుంటున్న కొంత మంది రైతులు తమ ధాన్యాన్ని పొలంలోనే కాటాలు వేసి చౌకగా అమ్ముకొంటున్నారు. వాతావరణం మారటంతో వ్యాపారులు కూడా ధాన్యాన్ని తక్కువ రేటుకి అడుగుతున్నారు. ఈ వాతావరణం వల్ల ధాన్యం బస్తాలు పట్టి ఇంటికి చేరవేసే కూలీలకు కూడా గిరాకి ఏర్పడింది. చేతికి వచ్చిన ధాన్యాన్ని చివరిలో వర్షానికి తడవబెట్టుకోవటం ఎందుకని దూర ప్రాంతాల నుంచి కూడా కూలీలను తెప్పించి ఇంటికి చేరవేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

వాతావరణంలో ఏ నిమిషంలో ఏ మార్పులు వస్తాయోనని రైతులు అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బుధవారం ఉదయం 10 గంటల వరకు వాతావరణం మబ్బుగా ఉండటంతో వరి హార్వెస్టింగ్ నిలుపుదల చేశారు. 11 గంటల తర్వాత కొద్దిపాటి పొడి వాతావరణం నెలకొనడంతో హార్వెస్టింగ్ పనులను తిరిగి ప్రారంభించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: నాదెండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ మార్పుల కారణంగా గురువారం విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3.30 గంటల వరకూ తూబాడు, గొరిజవోలు, సంకురాత్రిపాడు, చిరుమామిళ్ళ, జంగాలపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

సెన్సార్ బోర్డు సభ్యుడిగా సిరిపురపు అప్పారావు



నాదెండ్ల: పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ సిరిపురపు అప్పారావు కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు మెంబర్‌గా రెండో సారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన్ను పలువురు అభినందించారు. ఆయన గతం మూడేళ్ళుగా సెన్సార్ బోర్డు సభ్యుడిగా పనిచేయగా, మరో మూడేళ్ళపాటూ పదవి కాలాన్ని బోర్డు పెంచింది. రామకృష్ణ మఠం, వివేకానంద కేంద్రం వంటి వివిధ ధార్మిక సంస్థల్లో 18 ఏళ్ళ పాటూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం బీజేపీ క్రియాశీలక సభ్యుడిగా కొనసాగుతున్నారు. సినిమాలు సమాజానికి మేలు చేసే విధంగా ఉండాలని, ప్రజలను చైతన్యవంతుల్ని చేసే సినిమాలకు ప్రజాదరణ ఉంటుందన్నారు. ప్రస్తుతం దర్శక నిర్మాతలు పూర్తి కమర్షియల్ చిత్రాలకే కాకుండా ప్రజలకు ఆదర్శంగా ఉండే చిత్రాలు తీయాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి, గ్రామస్తులు పలువురు ఆయన్ను అభినందించారు.

సుస్థిరాభివృద్ధిపై మూడో రోజు శిక్షణ



నాదెండ్ల: ప్రణాళికాబద్ధమైన అంచనాల తయారీ, గ్రామాల అభివృద్ధికి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంగా పనిచేయాలని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో మూడోరోజు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు – స్థానికీకరణ అంశంపై మూడో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ దేవరపల్లి వెంకటరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధికి తోడ్పడే 17 అంశాలపై శిక్షణనిచ్చారు. గురువారంతో శిక్షణా కార్యక్రమం ముగియనుంది. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీకుమారి, ఏఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఎంఈవో కృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్ కవితా అనసూయ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నిర్మలా కృష్ణమాల, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎండీఓ కె.మ్యాథ్యూబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, ఇతర అంశాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఇప్పటికే మండల పరిషత్ సర్వసభ్య సమావేశ సమాచారాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు మండల పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులకు సర్క్యులర్లు అందజేశామన్నారు.

బాధిత మహిళకు నిత్యావసరాలు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సంజీవ గాంధీనగర్ 30వ వార్డులో నివసిస్తున్న ఎస్‌కె మంగమ్మ ఒంటరి మహిళ కిడ్నీల సమస్యలతో బాధపడుతోంది. ఈసందర్భంగా గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గంగినేని రాఘవరావు చేతుల మీదగా బాధిత మహిళకు 45 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు బుధవారం అందజేశారు. ఈకార్యక్రమంలో లగడపాటి శ్రీనివాసరావు, భక్తుల గోవిందరాజులు, బోడపాటి రామారావు, సోమేపల్లి శ్రీనివాసరావు, గోవిందయ్య, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

రెండోబ్యాచ్‌కు శిక్షణ ప్రారంభం

చిలకలూరిపేటటౌన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గురువారం నుంచి రెండోబ్యాచ్‌కు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామస్వరాజ్ అభియాన్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ చిలకలూరిపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో రెండుబ్యాచ్‌లుగా అధికారులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాలలో ఆర్థిక వనరుల సమీకరణ, పారిశుద్ధ్యం మెరుగు, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ఈ శిక్షణ ఇస్తున్నారు. మొదటిగా అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు 60 మందికి మొదటి బ్యాచ్‌గా 16,17 తేదీల్లోనూ నిర్వహించామన్నారు.

వర్సిటీ మహిళ ఖోఖో విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల



నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా ఖోఖో టోర్నమెంట్ విజేతగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల (నరసరావుపేట) టీం నిలిచింది. ద్వితీయ స్థానాన్ని విక్టరీ డిగ్రీ కళాశాల జట్టు, తృతీయ స్థానాన్ని జెఎంజె(తెనాలి) కళాశాల జట్లు కైవశం చేసుకున్నాయి. బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ సభలో డీఎస్పీ కె. నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కల్లం సంస్థల చైర్మన్ కల్లం మోహన్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి ఒద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడీ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పి. వేణుగోపాల్, పీడీ ఎస్. కృష్ణంరాజు పాల్గొన్నారు.

వర్సిటీ మహిళ ఖోఖో జట్టు ఎంపిక

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళ ఖోఖో జట్టును టోర్నమెంట్ చైర్మన్ మైనీడీ శ్రీనివాసరావు ప్రకటించారు. జట్టులో యు. నాగమల్లేశ్వరి, టి. శివ నాగలక్ష్మీ (జీసీ అండ్ వైబీఎస్ కళాశాల, కనిగిరి), ఎం.విజయశ్రీ (ధనలక్ష్మీ కళాశాల, ఎ. ముప్పాళ్ల), బి. అలేఖ్య, ఎం. హేమలత, కె. విశాలక్ష్మీ, ఎం. చౌడేశ్వరి (కృష్ణవేణి డిగ్రీ కళాశాల, నరసరావుపేట), పి. లక్ష్మీతిరపతమ్మ, కె. మంగమ్మ, పి. మానస (విక్టరీ డిగ్రీ కళాశాల, నరసరావుపేట), కె. రూప, బి. దుర్గ (జెఎంజె, తెనాలి), మంగ తయారు (యూనివర్శిటీ కళాశాల,నంబూరు), థెరిస్సా (ఆక్స్‌వర్డ్ కళాశాల, పిడుగురాళ్ల) యమున (బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, బాపట్ల) ఎంపికయ్యారు. సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎ. అరుణ సుజాత, జి. బాలశంకరరెడ్డి, టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ పి. శివప్రసాదు పాల్గొన్నారు.

కే-రిడ్జి పాఠశాలలో మెగా వైద్యశిబిరం



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మౌనిక

నరసరావుపేట ఈస్ట్: దంత సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ బేసిక్స్ సంస్థ వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ నరసింహస్వామి తెలిపారు. గుంటూరురోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో హెల్త్ బేసిక్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మెగా వైద్య శిబిరం బుధవారం ముగిసింది. శిబిరంలో దంత, కంటి, సాధారణ వైద్య పరీక్షలను విద్యార్థులకు నిర్వహించి తగిన వైద్య సలహాలు, మందులు అందించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, దంత సంరక్షణ ద్వారా ఎన్నో రోగాలను నివారించవచ్చని వివరించారు. పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, అకాడమిక్ కోఆర్డినేటర్ పుట్ట హేమంత్ పాల్గొన్నారు.

హెచ్‌బీఎల్ సేవలు ఎనలేనివి

నాదెండ్ల సర్పంచ్ కోటేశ్వరమ్మ



ఇర్లపాడులో మాట్లాడుతున్న కంపెనీ మేనేజర్ రాజేష్, వేదికపై సర్పంచ్ కోటేశ్వరమ్మ

నాదెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీతో హెచ్‌బీఎల్ కంపెనీ ఎనలేని సేవలందిస్తున్నదని సర్పంచ్ జి.కోటేశ్వరమ్మ చెప్పారు. ఇర్లపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ కంపెనీ ఆరో వార్షికోత్సవం సందర్భంగా కనపర్రు, బుక్కాపురం, ఎండుగుంపాలెం, ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెంల్లో కంపెనీ దత్తత తీసుకున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఆటల పోటీలు నిర్వహించి విజేతలైన వారికి బహుమతులు అందించారు. ఇర్లపాడు ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మాణానికి రూ.1.50 లక్షలు, అమీన్‌సాహెబ్‌పాలెం అంగన్‌వాడీ కేంద్రానికి రూ.50 వేలు, మిగిలిన అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.1 లక్ష విలువైన ఇనుప బీరువాలు, టీవీలు, కుర్చీలు, నోటుపుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజర్ జి రాజేష్ మాట్లాడుతూ కార్పొరేట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా దత్తత తీసుకున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు పౌష్టికాహారానికి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పార్థసారథి, అంగన్‌వాడీ ఉషారాణి పాల్గొన్నారు.

ఆశాజనకంగా మొక్కజొన్న



శావల్యాపురం: మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. బుధవారం మండలంలోని పొట్లూరు, ఇర్లపాడు గ్రామాల్లో మొక్కజొన్న పంటను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ మండలంలోని పొట్లూరు, ఇర్లపాడు, వేల్పూరు, గుంటుపాలెం తదితర గ్రామాల్లో ఇప్పటి వరకు రైతులు 2 వేల ఎకరాలు మొక్కజొన్న పంటను సాగు చేశారన్నారు. ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉండటం చేత మొక్కజొన్న పంటలో పొగాకు లద్దె పురుగు ఉధృతి కనిపించుతుందని తవుడు, బెల్లం, మోనోక్రోటోపాస్ వీటిని కలిసి చిన్న ఉండలుగా చేసుకొని సాయంత్రం సమయంలో పొలంలో చల్లితే లద్దెపురుగు నివారణ చేయవచ్చునన్నారు. ఏఈవో పూరేటి అశోక, రైతులు పాల్గొన్నారు.

వరుణుడు పొంచి ఉన్నాడు!

- రైతులు జాగ్రత్తలు పాటించాలి
- వ్యవసాయాధికారి టి శ్రీలత



చిలకలూరిపేట: వర్ష సూచనల నేపథ్యంలో వరి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి టి.శ్రీలత చెప్పారు. మండలంలోని వేలూరు, కుక్కపల్లివారపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో వరి పంట వేసిన రైతులు వర్ష పరిస్థితులను చూసి పంటకోత చేయవలసినదిగా సూచించారు. ఇప్పటికే పంట కోత చేసిన రైతులు పంటను సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలన్నారు. శనగ వేసిన రైతులు పూత దశలో 13.0.45 నీటిలో కరిగే ఎరువును పిచికారి చేసుకుంటే గింజ నాణ్యత బాగుంటుందన్నారు. దీంతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జీపీ శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

తక్షణమే చార్జీలు తగ్గించాలి

శావల్యాపురం: కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై అదనపు భారం మోపటం దుర్మార్గమైన చర్య అని మండల సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చందు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషను వద్ద విద్యుత్ చార్జీలు పెంపుదలపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మోహన్‌చందు మాట్లాడుతూ రాష్ట్రంలో కోటి యాభై లక్షల మంది వినియోగదారులపై ఆదాని స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం పడుతుందన్నారు. కార్యక్రమంలో గణపర్తి వెంకటేశ్వర్లు, బోయపాటి వెంకటరాయుడు, దుగ్గెంపూడి చిన వెంకయ్య,పచ్చవ శ్రీనివాసరావు, సూరబత్తిని గోవిందరాజులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో ఉధృతి నివారణ

నాదెండ్ల: పత్తి సాగు అనంతరం వేసే పంటల్లో పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి చెప్పారు. తూబాడు, చిరుమామిళ్ళ గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

బొల్లాపల్లి: ఐసీడీఎస్ ఈపూరు ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం గురించి ఒక రోజు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు సీడీపీవో బి.అరుణ మాట్లాడుతూ లింగ వివక్ష చూపరాదన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి, సెక్రటరీ డి. సురేష్, ఏఎస్‌ఎంలు, సంక్షేమ, విద్య సహాయకులు, మహిళా పోలీసులు ఈ శిక్షణలో పాల్గొన్నారు.

వాగ్దేవి విద్యార్థులకు పతకాలు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో వాగ్దేవి కళాశాల విద్యార్థులు పతకాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. వర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు డి.వీరాంజనేయులు డిస్క్‌త్రోలో బంగారు, షార్ట్‌పట్‌లో వెండి పతకాలు, 4''400 మీటర్ల రిలే పరుగు పందెంలో బంగారు పతకం, కె.ప్రవీణ్‌కుమార్ 200 మీటర్లు, 400 మీటర్లులో వెండి పతకాలు, షేక్. అల్మాస్ 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థులకు కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు అభినందించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

శావల్యాపురం: స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూల్లో సెమీక్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కనగాల వెంకట రామ మోహన్‌చందు పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ప్రేమను పంచిన గొప్ప మానవతా వాది అన్నారు. ప్రతి ఒక్కరు ఆయన చూపించిన మార్గాన్ని పయనించాలన్నారు. ప్రేమ దయ కరుణ జాలి క్షమ గుణాలు కల్గియుండాలన్నారు.లోక రక్షకుడుగా ఏసుక్రీస్తు ప్రపంచ మానవాళికి మార్గదర్శకుడు అయారు.అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేసి అందరికి శుభాకాంక్షలు తెలిపారు.

గంటావారిపాలెం డీసీ చైర్మన్‌గా వెంకట నారాయణ



వెంకట నారాయణ



నక్కా బుల్లిశ్వరరెడ్డి



గంగినేని రాఘవ



రావులపల్లి బుజ్జి

శావల్యాపురం: మండలంలోని గంటవారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఉన్ననటువంటి 11 సాగునీటి సంఘాలకు సంబదించిన అధ్యక్షులు ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నెస్పీ జరుగుల విజయలక్ష్మి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా డీఈ మాట్లాడుతూ డీసీ పరిధిలో 11 నీటి సంఘల అధ్యక్షులంతా సమిష్టిగా డీసీ అధ్యక్షులుగా శానంపూడి–1 మేజరు సాగునీటి సంఘం అధ్యక్షులు (206) మందలపు వెంకట నారాయణ,ఉపాధ్యక్షుడుగా ఏనుగుపాలెం–2 సాగునీటి సంఘం (214) అధ్యక్షులు మక్కెన ఏడుకొండలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీఈ విజయలక్ష్మి తెలిపారు. ఈసందర్భంగా డీసీ అధ్యక్షులు మందలపు వెంకట నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు స్థానిక ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు సారధ్యంలో సాగునీటి సంఘూలు అభ్యున్నతికి తన శక్తి వంచన లేకుండా అందరి సహకారంతో చేస్తామన్నారు.ఆయనతో పాటు గుంటూరు సాంబశివరావు,గడిపూడి విశ్వనాధం,గోరంట్ల హనుమంతరావు,చెరుకూరి ప్రసాదు,కోటా హరిబాబు,తదితరులు పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధికి కృషి చేస్తా

వినుకొండ(నూజెండ్ల): సాగునీటి సంఘూల సారధ్యంలో కాలువలు అభివద్ధికి తన వంతు కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన డీసీలు అన్నారు. నూజెండ్ల మండల పరిధిలో డీసీ 28 ఐనోలు మేజరు అధ్యక్షులు– రావులపల్లి బుజ్జి, డీసీ 29 త్రిపురాపురం మేజరుకు గంగినేని రాఘవ,డీసీ 30కు ములకలూరు మేజరుకు నక్కా బుల్లిశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన డీసీ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో కాలువల లైనింగ్ పనులు పూర్తి చేసి రైతుల సంక్షేమం కోసం పాటుపడతామన్నారు.

ప్రజాసేవకే జీవితం అంకితం చేసిన ధన్యజీవి

మాజీ మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న విడదల రజిని

చిలకలూరిపేట: నిత్యం ప్రజాసేవకే జీవితం అంకితం చేసిన ధన్యజీవి మాజీ మున్సిపల్ చైర్మన్ మాజేటి వెంకటేశ్వర్లు అని మాజీ మంత్రి విడదల రజిని కొనియాడారు. ఇటీవల మృతి చెందిన మాజీ మున్సిపల్ చైర్మన్ మాజేటి వెంకటేశ్వర్లు (బేబీ) సంస్మరణ సభను పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ముందుగా మాజేటి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్తవయసు నుంచే పలు వర్తక సంఘాలకు అధ్యక్షుడిగా, నాయకుడిగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకుడు కొప్పురావూరి పటేల్, పలువురు పట్టణ ప్రముఖులు, మాజేటి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే కఠినచర్యలు తప్పవు

డ్వామా పీడీ ఎం. సిద్ధ లింగమూర్తి



వెల్లటూరులో కాల్వ పూడిక తీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ, అధికారులు

బొల్లాపల్లి : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే వేటు తప్పదని పల్నాడు జిల్లా డ్వామా పీడీ ఎం. సిద్ధ లింగమూర్తి అన్నారు. మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, సరికొండపాలెం గ్రామాలను బుధవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగే పనులను పరిశీలించారు. ఐటీడీఏ పరిధిలో వెల్లటూరు గ్రామంలో జరిగే కాల్వ పూడికతీత, పేరూరుపాడు గ్రామంలో పల్లెవనంలో భాగంగా మంజూరైన గ్రీనరీ ఏర్పాటును, గోకులం షెడ్‌లు, సరికొండపాలెం గ్రామంలో ఉద్యాన పంటల సాగులో భాగంగా బత్తాయి తోటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీలో సిబ్బంది అవకతవకలకు, అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్వయంశక్తి సంఘాల ద్వారా సక్రమంగా పని జరిగేటట్లు చూడాలని ఉపాధి హామీ పనులకు హాజరుకాని కూలీల పేర్లు చేర్చినా, మస్టర్స్‌లో అవకతవకలు జరిగినా కఠినచర్యలు ఉంటాయన్నారు. మండలంలో 33 గ్రామ పంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించే విధంగా డిమాండ్ తీసుకొని రూపకల్పన చేసి కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగపరచుకోవాలని, రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గుచూపాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటరాజు, మండల జేఈ సుధాకరరావు, రవీంద్రారెడ్డి, సుబ్బారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ సిమ్మింగ్ జట్టుకు ఎస్ఎస్ అండ్ ఎన్ విద్యార్థి



జట్టుకు ఎంపికైన జగదీష్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పురుషుల స్విమ్మింగ్ జట్టుకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు బుధవారం తెలిపారు. గుంటూరు గోరంట్లలోని సిమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన అంతర్ కళాశాలల సిమ్మింగ్ పోటీలు, వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లో జగదీష్ ప్రతిభ చూపి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న సౌత్ వెస్ట్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల సిమ్మింగ్ పోటీల్లో జగదీష్ ఏఎస్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, అధ్యాపకులు జగదీష్‌ను అభినందించారు.

ఎరువులు, కషాయాలు సొంతంగా తయారు చేసుకోవచ్చు

ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: ప్రతి రైతు తన పంటకు కావల్సిన ఎరువులు, కషాయాలు సొంతంగా తయారు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శిక్షణ కార్యక్రమం అంజిరెడ్డి సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అమలకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు తన పంటకు అవసరమైన బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి ఎరువులను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చని తెలిపారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ వంటి రసాయన ఎరువుల ఖర్చును తగ్గించుకోవచ్చని తెలిపారు. పంటపై పిచికారీ కోసం కోడిగుడ్డు, నిమ్మరసం, చేప బెల్ల ద్రావణం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, పుల్లటి మజ్జిగ ద్రావణాలు, కషాయాలు రైతులస్థాయిలో సొంతంగా తయారు చేసుకోవచ్చని వివరించారు. దీనివలన పెట్టుబడి 30 శాతం ఖర్చు తగ్గడంతో నికర ఆదాయం పెరుగుతుందని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి



నరసరావుపేట: అభివృద్ధిలో నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలనే కసితో పరుగులు పెడుతున్నానని, ప్రభుత్వం తరపున తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి విన్నవించారు. ఈ మేరకు బుధవారం ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నో వనరులున్న నియోజకవర్గం ఇప్పటివరకు అభివృద్ధికి నోచుకోలేదని, మీ నాయకత్వంలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి దిక్సూచిగా మార్చాలని భావిస్తున్నట్లు వివరించారు.

TMB తమిళనాడ్ మర్కంటైల్ బ్యాంకు లిమిటెడ్
1st Floor, D.No.23-194, పల్నాడురోడ్, వినుకొండ(మం), సెల్: 9177285567

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ పరిహరించిన బంగారు నగల పై అప్పులు తీసుకున్న ఖాతాదారులు విరిగి సకాలంలో చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం ది. 30.12.2024 సోమవారం మ.3.00 గంటలకు బ్యాంకు ఆవరణలో వేలం వేయబడును.

క్ర.సం.	లోన్ ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు చిరునామా	[illegible]
1	[illegible]	[illegible]	68.00

షరతులు, నిబంధనలు : [illegible]

స్థలం : వినుకొండ
తేది : 18-12-2024
సం/- బ్రాంచ్ మేనేజర్, వినుకొండ

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసరావుపేట డివిజన్

99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)

Office mail : sakshigntadvt@gmail.com